
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025



అమ్మకానికి ఆశ్రమ స్థలం..!

బోగస్ పట్టాలతో విక్రయానికి సన్నాహాలు

● ఒకటిన్నర సెంటు రూ.1.10 లక్షలకు బేరం ● కొడిమిలో ప్రభుత్వ స్థలంపై అధికారుల నిర్లక్ష్యం

అనంతపురంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో దొంగపట్టాలతో స్థలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కన్నేసి కాజేస్తున్నారు. ఈ కోవలోనే అనంతపురం రూరల్ మండలం కొడిమి పరిధిలో ఓ అనాథ ఆశ్రమం స్థలం అమ్మకానికి పెట్టారు. దొంగపట్టాలు సృష్టించి విక్రయించేందుకు కుట్రపన్నుతున్నారు. ఒకటిన్నర సెంటు రూ.1.10 లక్షలతో కొంత మంది అధికార పార్టీ నేతలతో బేరం కుదుర్చుకున్నారు. ఇటీవల అధికార పార్టీనేతలు దగ్గరుండి ఆశ్రమ స్థలంలోని ఏళ్ల నాటి చెట్లను తొలగించి శుభ్రం చేశారు. ఈ వ్యవహారం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదని సమాచారం.


చెట్లను తొలగించి శుభ్రం చేసిన ఆశ్రమ స్థలం

అనాథాశ్రమం ఏర్పాటు

అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి గ్రామ సర్వే నెంబరు 142-4లో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 2010లో కొంత మందికి అప్పటి రెవెన్యూ అధికారులు ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. ఈ సర్వే నెంబరులోనే 30 సెంట్ల వరకు మరికొంత భూమి ఉంది. ఇందులో రుద్రంపేటకు చెందిన ఓ వ్యక్తి ఆ సమయంలోనే జనని అనాథ ఆశ్రమాన్ని ప్రారంభించాడు. రెండు షెడ్లు ఏర్పాటు చేశాడు. నలుగైదుగురు అనాథలు అందులో ఉండేవారిని తెలుస్తోంది. ఆశ్రమం ప్రారంభమైన ఆరేడు మాసాల్లోనే వారందరూ వెళ్లిపోయారు. దీంతో ఆశ్రమం ఖాళీ అయినట్లు స్థానికులు అంటున్నారు. అప్పటి నుంచి స్థలం ఖాళీగానే ఉంది. దీంతో సదరు వ్యక్తి ఆశ్రమం అమ్మకానికి సిద్ధమయ్యాడు.

బోగస్ పట్టాలతో విక్రయం

ఆశ్రమం స్థలం ఖాళీ అయినప్పటి నుంచి విక్రయించేందుకు సదరు వ్యక్తి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే స్థలాన్ని మూడు సెంట్లు, రెండున్నర సెంట్లు, నాలుగు సెంట్ల ప్రకారం పాట్లు స్కెచ్ గీయించాడు. అందుకు అనుగుణంగా 2013లో అప్పటి రెవెన్యూ అధికారుల సంతకాలతో పట్టాలు సృష్టించాడు. ఆ మేరకు విక్రయ ప్రయత్నాలు ప్రారంభించాడు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ నేతలకు స్థలాన్ని ప్లాట్ల ప్రకారం విక్రయించేందుకు ప్రయత్నించాడు. స్థలానికి అనాథ ఆశ్రమం అన్న పేరు ఉండడంతో వారు మొగ్గు చూపలేదని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక టీడీపీ నాయకులతో విక్రయించాలని ప్రయత్నాలు చేశారు. ఒకటిన్నర సెంటుకు రూ.1.10 లక్షలతో విక్రయించేందుకు బేరం కుదుర్చుకున్నాడు. దీంతో ఆశ్రమ స్థలంలోని చెట్లను తొలగించి శుభ్రం చేశారు. ఈ వ్యవహారం గురించి తెలుసుకున్న స్థానికులు అడ్డుకున్నట్లు తెలుస్తోంది.

రెండు, మూడు సెంట్ల ప్రకారం పట్టాలు

రెవెన్యూ అధికారులు సెంటు, ఒకటిన్నర సెంటు ప్రకారం పేదలకు పట్టాలు ఇస్తారు. పదేళ్ల కిందటే అప్పటి రెవెన్యూ అధికారులు ఆశ్రమ నిర్వాహకుడికి నాలుగు, మూడు, రెండున్నర సెంట్ల ప్రకారం పట్టాలు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. పట్టాలో సర్వే నెంబరు 142-4గా నమోదు చేయించాడు. ఆశ్రమ స్థలం సర్వే నెంబరు 142-5 కిందికి వస్తుందని రెవెన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది.

విషయం మా దృష్టికి వచ్చింది



కొడిమి గ్రామం ప్రజాచైతన్య కాలనీలో ఆశ్రమ స్థలం అమ్మకం విషయం మా దృష్టికి వచ్చింది. ఆ మేరకు సదరు వ్యక్తిని పిలిపించి మాట్లాడాను. పట్టాలున్నాయంటే వాటిని తీసుకుని రావాలని చెప్పాను. అదేవిధంగా స్థలంలోకి ఎవ్వరూ వెళ్లకూడదని చెప్పాను.

- మోహన్‌కుమార్, తహసీల్దార్ అనంతపురంరూరల్



విత్తనం వేయలేకపోయా



నాకున్న మూడెకరాల పొలంతో పాటు 12 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. వేరుశనగ సాగుకు ఖర్చులు ఎక్కువగా వస్తుండటంతో రెండేళ్లుగా కంది పంట పెడుతున్నా. ఈసారి విత్తనం సిద్ధం చేసుకున్నా. పదును వర్షం పడకపోవడంతో విత్తలేకపోయా. అదునులోగా పదును వర్షం పడితే కంది పంట వేస్తా. లేదంటే ఈసారి పొలాలను బీడుగా పెట్టుకోవాల్సిందే.

-పూజారి పెద్దన్న, రైతు, కడదరకుంట, కూడేరు మండలం

పదును వర్షం పడకపోవడంతో కూడేరు సమీపంలో బీడుగా ఉంచిన పొలం



ప్రత్యామ్నాయమే శరణ్యమా..?

ముందస్తుగా నైరుతి వచ్చినా ఫలితం అంతంతే..!

అరకొర వర్షానికే విత్తనం వేస్తున్న రైతులు
నెలాఖరుదాకా వేరుశనగ, కంది ఇతర పంటల సాగుకు అనుకూలం
తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందే..

అనంతపురం అర్బన్/కూడేరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనంత రైతును ఈసారి వర్షాభావం వెంటాడింది. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ఆశించిన స్థాయిలో ముందుకుసాగలేదు. ఖరీఫ్‌కు ముందు నెలలో పడిన వర్షాలకు పొలాల్లో సేద్యం పనులు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన జూన్ నెలలో కురిసిన వర్షాలకు అరకొరగా పంటలు సాగు చేశారు. పలు మండలాల్లో కొన్నిరోజులుగా కురుస్తున్న అరకొర వర్షానికే పదును లేకపోయినా కంది, ఇతర పంటలు విత్తుకుంటున్నారు. పదును వర్షం పడకపోవడంతో మరికొందరు వచ్చే నెలలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే ఆలోచనలో ఉన్నారు. నెలాఖలోపు పదును వర్షం పడకపోతే వచ్చే నెలలో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్న యోచనలో జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఉంది.

ముందస్తుగా నైరుతి వచ్చినా..!

ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వానలు పడటం లేదు. అక్కడక్కడా చిరుజల్లులకే పరిమితమైంది. గతేడాది మే 29వ తేదీ కేరళకు... జూన్ 2న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది మే 24న కేరళకు... మే 26న జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. కొన్ని రోజులుగా జిల్లాలో తేలికపాటి వర్షాలే పడుతున్నాయి. వర్షం పడే అవకాశం ఉందని ఇదివరకు పలుమార్లు వాతావరణ శాఖ ప్రకటించినా మేఘావృతం కావడం... తుంపర జల్లులకే పరిమితమైంది. జూన్ సాధారణ (మిగతా 7వ పేజీలో...)

నెలాఖరు వరకు అవకాశం

వేరుశనగ, కంది, ఆముదం, పత్తి ఇతర రకాల పంటలు సాగు చేసేందుకు నెలాఖరు దాకే అదును సమయం. ఇందుకు మరో నాలుగు రోజులే సమయం ఉంది. ఆలోగా పదును వర్షం పడకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాల్సిందే. కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతమవుతున్నా.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలకే పరిమితమైంది. అదును సమయం దాటిపోతుందన్న కారణంతో పలు మండలాల్లో అరకొర పదునుకే కంది, ఇతర రకాల పంటలు విత్తుకుంటున్నారు. ఇదివరకు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించినా.. ఆశించిన స్థాయిలో పడలేదు. అదును సమయంలోగానైనా పదును వర్షం కురిస్తే విత్తనం వేసుకోవచ్చన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. నెలాఖరులోగా పదును వర్షం కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలైన కొర్ర, ఉలవ, సజ్జలు, అలసంద తదితర పంటల సాగే శరణ్యమన్న అభిప్రాయాన్ని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పొలంలో దిబ్బలు

హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల్లో ఇష్టారాజ్యం


ఉస్తిలిపల్లి వద్ద రైతుల భూమిలో వేసిన కాలువ మట్టి

తనకల్లు, జూలై27(ఆంధ్రజ్యోతి): భూమే రైతులకు జీవనాధారం. మండలంలోని ఉస్తిలిపల్లికి చెందిన రైతులు గతంలోనే కొంత భూమిని హంద్రీనీవా కాలువ కోసం ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఒకట్రెండు ఎకరాలు మాత్రమే మిగిలింది. ఆ భూమిలోనే పంటలు పండించుకుని, జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం మూలంగా ఉన్న కొంత భూమి కూడా రైతులకు దక్కకుండా పోతోంది. కాలువ తవ్వకాల ద్వారా వచ్చిన మట్టిని రైతుల భూముల్లోకి ఇష్టారాజ్యంగా డంప్ చేస్తున్నారు. దీంతో తాము జీవనాధారం కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. మట్టిని తొలగించుకోవాలంటే తమ భూములు అమ్ముకున్నా కుదరదని ఆవేదన చెందుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు. అధికారులు వినతులు సమర్పించినా పట్టించుకోకపోవడంతో పనులను అడ్డుకున్నారు. దీంతో కొన్ని రోజులుగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా తమకు న్యాయం చేయకుంటే ఆందోళనలు (మిగతా 7వ పేజీలో...)

ఇదేమి న్యాయం?



చెప్పాపెట్టకుండా కాలువ మట్టిని తీసి, మా భూముల్లో కొండలాగా వేశారు. దానిని తరలించడం మా వల్ల అయ్యే పని కాదు. నా పొలంలో వేసిన మట్టిని తొలగించి, న్యాయం చేయాలి.

-బావయ్య, రైతు, ఉస్తిలిపల్లి

టమోటాలు కిలో రూ.37

అనంతపురంరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టమోటాలు గరిష్టంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్టంగా రూ.24తో, సరసరాగా రూ.30తో విక్రయాలు జరిగినట్లు చెప్పారు.

స్పీడ్ అందుకోలేదు..!

సేవలకు సర్వర్ సమస్య
తపాలా కార్యాలయంలో పడిగాపులు
వినియోగదారుల సహనానికి పరీక్ష
7

ఉభయసభల కమిటీలో ఎమ్మెల్యే దగ్గుపాటికి చోటు



అనంతపురం క్రైం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉభయ సభల సంయుక్త కమిటీలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు చోటు కల్పించారు. శాసన సభ, శాసనమండలికి సంబంధించి శాసనసభ స్పీకర్ అయ్యనపాత్రుడు, మండలి చైర్మన్ మోషన్ రాజ్ 2025-26 ఏడాదికి సంయుక్త కమిటీలను నియమించారు. మైనార్టీ సంక్షేమం కమిటీలో ఎమ్మెల్యే దగ్గుపాటికి చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతికి పనిచేసే అవకాశం దక్కిందన్నారు. తనకు చోటు కల్పించిన స్పీకర్, చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతపురం అర్బన్‌లో మైనార్టీ, ఇతర అల్ప సంఖ్యావర్గాలు ఎక్కువగా ఉన్నారని, వారి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి : ఏపీటీఎఫ్ 7



సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం తరలివచ్చారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు బంగారు ఆభరణాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణచేసి పూజారులకు అందజేశారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు పాలాభిషేకం, పంచామృత అభిషేకం, బంగారుకవచ అలంకరణ, ఆకుపూజ, అర్చన మహానైవేద్యం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బాబు, ప్రధాన అర్చకులు రామస్వామి పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం మొదటి ఆదివారం కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు వేకువజామున స్వామిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.


కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అలంకరణ

వేడుకున్నా.. వినకపోతివే నాన్నా..!

● విషపు గుళికలు మింగిన రైతు..
● ఇద్దరు బిడ్డలకు బలవంతంగా మింగించిన వైనం ● ముగ్గురి పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న రమేష్ రెడ్డి

నాన్న పొలం
వద్దకు తీసుకెళ్తానంటే..
ఆనందంగా వెళ్లారు..
విషపు గుళికలు
మింగుతుంటే..
మాత్రలేమో అనుకున్నారు..
బిడ్డలకూ మింగించాలని
చూశాడు..
భరించలేనంత వాసన..
వద్దని చిన్నారులు వేడుకున్నా..
వినకుండా..
వారి గొంతులో పోశాడు..
ఇంటికి రాగానే..
అమ్మకు చెప్పి.. పసిపాప
సొమ్మసిల్లి పడిపోయింది..
నాన్న క్షణికావేశంతో..
ముగ్గురూ ఆస్పత్రిపాలయ్యారు..
మృత్యువుతో పోరాడుతున్నారు..


చికిత్స పొందుతున్న కుముద్విని


చికిత్స పొందుతున్న చైత్ర

- వివరాలు 7లో..



అందాల నిధి.. అనంతలో సందడి..

హరిహర వీరమల్లు ఫేమ్, సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ అనంతపురంలో ఆదివారం సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆమెను చూడడానికి ఫ్యాన్స్ ఎగబడ్డారు. అందరికీ అభివాదం చేస్తూ.. ఆమె ఉత్సాహపరిచారు. -అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి)

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న కోనంకి అశోక్‌కుమార్

కొత్తచెరువు, జూలై 27(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సత్యసాయి జిల్లా సబ్ కమిటీ సమావేశాన్ని ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. నూతన పీఆర్సీ 2023 జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రావలసి ఉందన్నారు. రెండేళ్లయినా పీఆర్సీ కమిషన్‌ను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇప్పటికి మూడు డీఏలు బకాయిలు ఉన్నప్పటికీ ఒక్క డీఏ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్ర, నాయకులు బీకే ముత్యాలప్ప, పీవీ మాధవ, త్రిమూర్తి, ఆదిబయన్న, రవీంద్రారెడ్డి, బలరాం, శ్రీనివాసులు, గోపాల్, వెంకటరమణనాయక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూలై 27(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వివాదానికి క్షణికావేశంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. నగరంలోని మెడికల్ కాలేజ్ క్వార్టర్స్‌లో ఉంటున్న వినోది(40) అనే మహిళ కుటుంబ కలహాలతో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... కడప జిల్లాకు చెందిన దంపతులు మెడికల్ కాలేజ్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి 10వ తరగతి చదివే ఒక కుమారుడు ఉన్నాడు. వినోదిని గృహిణి కాగా ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలోని సర్జన్ విభాగంలో పనిచేస్తున్నారు. మధ్యాహ్నం కొడుకు సెల్‌ఫోన్ చూస్తుండగా.. మందలించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో భర్త కలుగజేసుకోవడంతో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆమె భావోద్వేగానికి గురై గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఆమె కొంతసేపటి తర్వాత వస్తుందిలే అనుకుని భర్త, కొడుకు అన్నం తింటున్నారు. చాలాసేపటి వరకూ బయటకు రాకపోవడంతో గది తలుపు తట్టారు. తెరవకపోవడంతో అనుమానం వచ్చి గట్టిగా బద్దలు కొట్టి వెళ్లి చూడగా.. ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి..

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారన్న కారణంగా పట్టణానికి చెందిన శృతి (18) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణానికి చెందిన మోహన్, లక్ష్మీదేవి కుమార్తె శృతి స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో సెకెండ్ ఇంటర్ చదువుతోంది. శృతి సెల్‌ఫోన్‌లో ఇతరులతో ఎక్కువగా మాట్లాడుతుండటంతో గమనించిన తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శృతి ఉరివేసుకుని మృతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాయదుర్గంరూరల్, జూలై27(ఆంధ్రజ్యోతి): కూతురిని చూసేందుకు బుల్లెట్ వాహనంపై వెళుతూ మసూద్‌బేగం(55) అనే మహిళ మండలంలోని కదరంపల్లి వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. బంధువులు, స్థానికులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం నేత్రపల్లికి చెందిన మసూదాబేగం మనవడితో కలిసి బుల్లెట్ వాహనంలో నేత్రపల్లి నుంచి కణేకల్లు క్రాస్‌కు వెళుతున్నారు. అనంతపురం-రాయదుర్గం జాతీయ రహదారిపై కదరంపల్లి వద్ద ఆమె చీరకొంగు బుల్లెట్ వాహనం చక్రంలో ఇరుక్కోవడంతో ఒక్కసారిగా తారురోడ్డుపై పడడంతో తలకు తీవ్రమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్రవాహనం నడుపుతున్న మనవడికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మృతురాలికి భర్త పీరాసాబ్‌తో పాటు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు



షేక్‌బాషా (ఫైల్)

ధర్మవరం, జూలై27(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని తుంపర్తి కాలనీకి చెందిన షేక్ బాషా(60) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి డీవై కుళాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి సహకారంతో నేత్రాలను సేకరించారు. మృతుడి భార్య షహీద, కుమార్తె సదాను సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు మోహన్, లోకేశ్ పాల్గొన్నారు.

వేడినీళ్లు పడి చిన్నారి మృతి

అనంతపురం క్రైం, జూలై27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగర్‌లో చిన్నారిపై వేడి నీళ్లు పడి మరణించింది. వన్‌టౌన్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయ నగర్‌లో ఫయాజ్, భాను దంపతులు నివాసం ఉంటున్నారు. ఫయాజ్ కియలో డ్రైవర్‌గా, భాను క్యాటరింగ్ పనులకు వెళ్తుండేవారు. పనులకు వెళ్లినపుడు కూతురు సాబియా(5)ను ఇంటికి ఎదురుగా ఉన్న రత్నమ్మ ఇంట్లో వదిలేవారు. శనివారం రాత్రి అక్కడే నిద్రపోయింది. ఆదివారం ఉదయం స్నానం కోసం రత్నమ్మ కొడుకు వేడి నీళ్ల పాత్ర తీసుకెళ్తుండగా జారిపడి సాబియాతోపాటు, మరో ఇద్దరు పిల్లలపై పడ్డాయి. ఇద్దరు పిల్లల భుజాలపై పడి స్వల్ప గాయాలు కాగా, సాబియాకు కడుపు, గొంతు కిందిభాగంలో పడటంతో 60 శాతం వరకూ కాలిన గాయాలయ్యాయి. హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా గుత్తి సమీపానికి వెళ్లేసరికి బాలిక మరణించింది. సాబియా మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

స్పీడ్ అందుకోలేదు..!

తపాలా సేవలకు సర్వర్ సమస్య
కార్యాలయంలో తప్పని పడిగాపులు
వినియోగదారుల సహనానికి పరీక్ష



పోస్టు చేయడానికి వచ్చిన వినియోగదారులు

అనంతపురం విద్య, జూలై 27(ఆంధ్రజ్యోతి): తపాలా కార్యాలయాల్లో వినియోగదారులకు సేవలను మరింత స్పీడ్ చేయాలని తలపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్‌కు సమస్యలు వెంటాడుతున్నాయి. కేంద్రప్రభుత్వం కొత్తగా 2.0 ఆన్‌లైన్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక ఇంటి నుంచే తపాలా బుకింగ్ సేవలు పొందవచ్చని ఆ శాఖ అధికారులు గొప్పగా చెప్పారు. రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టులు చేయాలంటే పోస్టాఫీసులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అనుకున్నట్లుగానే ఈనెల 20వ తేదీ నుంచి 22వరకు నూతన సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గతంలో మాదిరి రోజులు తరబడి ఎదురుచూడాల్సిన పని ఉండదు.. ఏ రోజుకారోజు తమ పోస్టులను అనుకున్న వారికి అందుతాయని వినియోగదారులు ఆనందపడ్డారు. కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలు మొదలు పెట్టి వారం రోజులు కావస్తున్నా.. అనుకున్న మేరకు సేవలు అందడంలేదు. రిజిస్టర్ పోస్టు కూడా చేయలేకపోతున్నారు. రెండు మూడు రోజులు తపాలా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. సర్వర్ సమస్యతో సకాలంలో పోస్టు చేయలేకపోతున్నారు. మరోవైపు కొత్త సాఫ్ట్‌వేర్ పనితీరుపై సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో వినియోగదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. తపాలా సిబ్బందిలోనే కొత్తసేవలపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. పోస్టుమ్యాన్‌లకు పరికరం ఇవ్వకుండానే సొంతఫోన్లలోనే డోర్‌స్టెప్ సర్వీస్‌యాప్ డౌన్‌లోడ్‌చేసుకొని సేవలందించాలని చెప్పడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓ పథకం పెట్టినపుడు అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మరికొందరు అంటున్నారు.

పోస్టల్ ఎస్పీ వింత సమాధానం

పోస్టల్ సేవలలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ గంటల తరబడి పడిగాపులు కాస్తూ నరకం చూస్తున్నారు. తపాలా కార్యాలయ సిబ్బందిని అడిగితే సర్వర్ సమస్య అని తప్పించుకుంటున్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ ఆదినారాయణ మాత్రం వింత సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారు. శనివారం ఈ సమస్యపై ఆయనను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. 'నేను ఇన్‌చార్జ్‌ను.. ఇపుడు అక్కడ లేను.. నీకేమైనా కావాలంటే మా ఏఎస్పీని అడగండి' అంటూ సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశారు. వినియోగదారుల సేవలపై ఆయన ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నారో తెలుసుకోవచ్చు.

రెండు రోజులుగా తిరుగుతున్నా



మా స్కూల్‌కు సంబంధించిన సమాచారాన్ని తపాలా కార్యాలయంలో రిజిస్టర్ పోస్టుచేసి పంపాల్సి ఉంది. రెండురోజులుగా జిల్లా పోస్టాఫీస్‌కు వస్తున్నా.. ఇక్కడికి వచ్చి క్యూలో గంటలకొద్దీ దగ్గరకు వెళితే.. తీరా సర్వర్ పనిచేయలేదంటున్నారు. రెండురోజులుగా తపాలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కాలేదు.

-ఎర్రిస్వామి, అనంతపురం

జిల్లా కార్యాలయంలోనే ఇలా ఉంటే ఎలా..?



నాది ఆత్మకూరు. ఒక రిజిస్టర్ పోస్టు చేయాల్సి ఉంది. జిల్లా తపాలా కార్యాలయంలో సులభంగా పోస్టు చేయొచ్చని వచ్చా. మూడురోజులుగా తిరుగుతున్నా ఒక రిజిస్టర్ పోస్టు చేయలేకపోతున్నా. ఏమంటే సర్వర్ పనిచేయడం లేదంటున్నారు. ఇది పద్ధతికాదు.. ఈ సమస్య పరిష్కరించి వినియోగదారుల కష్టాలు తీర్చాలి.

-నాగరాజు, ఆత్మకూరు

బీమాను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన పంటలను పండించే రైతులు, కౌలు రైతులు రెండు పంటల బీమా పథకాలకు అర్హులని తెలిపారు. నోటిఫికేషన్‌లో పొందుపర్చిన గడువులోగా బ్యాంకులో రుణం తీసుకున్న రైతులు, రుణం పొందని రైతులు ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవచ్చు అన్నారు. బ్యాంకులో పంట రుణం పొందిన రైతులతో బ్యాంక్ సిబ్బంది పంటలకు ఇచ్చిన రుణం నుంచి ప్రీమియం సొమ్ము బీమా కోసం జమ చేస్తారన్నారు. ముందుగానే రుణం తీసుకున్న రైతులు బ్యాంక్ అధికారులకు సంప్రదిస్తే తిరిగి ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తారన్నారు. రుణం తీసుకోని రైతులు స్వతహాగా కామన్ సర్వీస్ సెంటర్, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం ఆధార్, భూమి పత్రాలు, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డు, రైతు డిక్లరేషన్ లేనిపక్షంలో పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్‌ఎస్‌కే సిబ్బందితో తీసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న పత్రం, సెల్ నెంబర్, రైతు సేవింగ్ ఖాతా వివరాలు అవసరమన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన



ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద కంది పంటను గ్రామం యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో ఫ్యూచర్ జనరలీ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దిగుబడి ఆధారిత పంటల విషయంలో పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని.. గత 7 సంవత్సరాల దిగుబడి ఆధారంగా లెక్కించి, దిగుబడి తగ్గినపుడు బీమా వర్తింపజేస్తారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం వివరాలు

పంట పేరు	బీమా మొత్తం (హెక్టారుకు)	రైతు చెల్లించాల్సిన మొత్తం ఎకరాలకు	హెక్టారుకు	గడువు తేదీ
కంది	50,000	80	200	జూలై 31
వరి	1,02,500	164	410	ఆగస్టు 15
జొన్న	52,500	84	210	జూలై 31
మొక్కజొన్న	82,500	132	330	జూలై 31
ఆముదం	50,000	80	200	జూలై 31
ఎండు మిరప	2,25,000	576	1400	జూలై 31

వాతావరణ ఆధారిత బీమా

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వతేదీ వరకే గడువు ఉండేదని, జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుకు ఇంకా సమయం ఉండటంతో ఈనెల 31వతేదీ దాకా గడువు పొడిగించారని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారు. ఆయా పంటలను మండల యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఈ ఏడాది జూలై 1 వతేదీ నుంచి వచ్చే ఏడాది మే నెలాఖరుదాకా ఏడాది కాలం వ్యవధిలో అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో లెక్కించి, బీమాను వర్తింపజేస్తారు.

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు..

పంట పేరు	బీమా మొత్తం (హెక్టారుకు)	రైతు చెల్లించాల్సిన మొత్తం ఎకరాకు	హెక్టారుకు
వేరుశనగ	80,000	640	1600
పత్తి	95,000	1140	1600
దానిమ్మ	1,87,500	3750	9375
చీనీ	1,37,500	2750	6875
టమోటా	80,000	1600	4000
అరటి	1,50,000	3000	7500

అట్టహాసంగా చందన షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం

సందడి చేసిన సినీతార నిధి అగర్వాల్
కేరింతలు కొట్టిన యువత



చందన షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న నిధి అగర్వాల్

అనంతపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సూర్యానగర్ 80 అడుగుల రోడ్డు సర్కిల్ వద్ద నూతనగా ఏర్పాటు చేసిన చందన షాపింగ్‌మాల్ 3వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్‌తోపాటు సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో తయారైన పట్టుచీరలను చందన షాపింగ్‌మాల్ నిర్వాహకులు తీసుకుని విక్రయించి, తయారీదారులకు ఉపాధి కల్పించాలన్నారు. స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. సినీనటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ... మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఉండేలా చందన షాపింగ్‌మాల్‌ను అనంతలో నెలకొల్పడం శుభపరిణామం అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చందన షాపింగ్‌మాల్‌గా కొత్త బ్రాండ్‌తో ఏర్పాటైన తర్వాత సుల్లూరుపేట, ఆదోని తర్వాత అనంతపురం జిల్లాలో మూడో బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారని, త్వరలో మదనపల్లిలో మరో బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. చందన షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి సినీ హీరోయిన్ వస్తున్నారన్న సమాచారంతో అభిమానులు, యువత పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సినీతార అక్కడికి చేరుకోగానే ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. నిధి అగర్వాల్ అభిమానులను పలకరిస్తూ మరింత ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో కోనంకి గంగారాం, చందన షాపింగ్‌మాల్ యాజమాన్యం మావూరి శ్రీనివాసరావు, సంతోష్, రామ్మోహన్, వెంకట గణేష్ పాల్గొన్నారు.

పొలంలో దిబ్బలు

(5వ పేజీ తరువాయి)

చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

గుట్టలుగా మట్టి

హంద్రీనీవా కాలువ తవ్వినపుడు ప్రభుత్వం భూమి సేకరించింది. సంబంధిత రైతులకు పరిహారం కూడా చెల్లించింది. ప్రస్తుతం కాలువ వెడల్పు, లైనింగ్ పనులు చేపడుతున్నారు. ఉస్తిలిపల్లి వద్ద కాలువ ఎక్కువ లోతు తవ్వాల్సి వస్తోంది. దీంతో మట్టి భారీగా తవ్వుతున్నారు. ఆ మట్టిని ప్రభుత్వం సేకరించని, రైతుల భూముల్లో వేస్తున్నారు. గుట్టలుగా మట్టి వేశారు. గతంలోనే కాలువకు భూమిని కోల్పోయామనీ, ఇప్పుడు మిగిలిన కొంతలోనూ మట్టి వేస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పరిహారం చెల్లిస్తామన్నా తాము ఒప్పుకునేది లేదన్నారు.

భూమి అమ్మినా.. మట్టిని తరలించలేం
: రామచంద్ర, రైతు, ఉస్తిలిపల్లి



హంద్రీనీవా కాలువ కాంట్రాక్టర్ మా భూమిలో పెద్ద కొండలా కాలువ మట్టిని నింపేశాడు. దీంతో రెండెకరాల వ్యవసాయ పొలం కోల్పోయా. ఆ మట్టిని తరలించాలంటే నాకున్న రెండెకరాలు అమ్మినా కుదరదు. ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలి.

నిబంధనలు పాటిస్తున్నాం
: వెంకటరత్నం, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాంట్రాక్టర్

హంద్రీనీవా కాలువ పనుల కోసం గతంలో ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది.కాలువల్లో తవ్విన మట్టిని ప్రభుత్వం సేకరించిన భూముల్లోనే వేస్తున్నాం. పొరబాటున రైతుల భూముల్లో పడి ఉండుంటే వెంటనే తొలగిస్తాం. మూడురోజుల్లోగా సర్వే చేయిస్తాం.

లిక్కర్ స్కామ్ డబ్బు స్వాధీనం చేసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

అనంతపురం విద్య, జూలై27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ ద్వారా కొట్టేసిన డబ్బులు, ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. దాదాపు రూ.3,500 కోట్ల లిక్కర్‌స్కామ్ జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం, విచారణ చేస్తున్న సిట్ చెబుతున్నాయన్నారు. ప్రజల సొమ్మును లిక్కర్ రూపంలో దోచుకున్నది నిజమైతే దానిని స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ ఖజానాకు జమ చేసినపుడే ఫలితం ఉంటుందని సూచించారు. అప్పుడే సిట్‌పై కూడా విశ్వాసం పెరుగుతుందన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడు విద్యుత్ చార్జీల పెంపు, స్మార్టుమీటర్ల బిగింపు, అదానీకి కాంట్రాక్ట్ కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక వాటిగురించి మాట్లాడకపోగా.. అమలు చేయడం దుర్మార్గమన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీష్, అనంత జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయమే శరణ్యమా..?

(5వ పేజీ తరువాయి)

వర్షపాతం 61.0 మి.మీలు కాగా.. ఈ ఏడాది 47.9 మి.మీ.కే పరిమితమైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ, కాగా ఇప్పటిదాకా 34.1 మి.మీ, వర్షపాతం నమోదైంది.

అరకొరగానే పంటల సాగు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షలు, కంది 55,296, పత్తి 44 వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1,719, సజ్జ 2,054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లలో సాగవుతాయని అంచనా వేశారు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. ఈ సారి ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 1.07 లక్షల హెక్టార్లలో (31 శాతం) మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 38,104 హెక్టార్లలో మాత్రమే సాగైంది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జల పంటలు వేశారు.

అరకొర తేమలోనే విత్తనం వేశా:
అంతర గంగన్న, రైతు, కరుట్లపల్లి, కూడేరు మండలం



దేవుడిపై భారం వేసి 9.30 ఎకరాల్లో అరకొర తేమలోనే కంది పంట వేశా. పది రోజుల క్రితం ఐదు, ఐదు రోజుల క్రితం మిగిలిన పొలంలో కంది పంట వేశా. వచ్చేనెలలోనైనా వర్షాలు పడకపోతాయా అని ఆశతో ఎదురుచూస్తున్నాం. గతేడాది మాదిరిగానే ఈ సారి సరిగా వానలు పడటం లేదు. వానలు సమృద్ధిగా కురిస్తే ఈ ఏడాది గట్టెక్కుతాం. లేదంటే పూర్తిగా నష్టపోవాల్సిందే.

నెలాఖరు దాకా అదును:
చంద్రాయుడు, కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త



నెలాఖరు దాకే వేరుశనగ, కంది ఇతర ప్రధాన పంటల సాగుకు అదును సమయం. అప్పటిలోగా పదును వర్షం పడితే ప్రధాన పంటలు సాగు చేసుకోవాలి. వచ్చే నెలలో వర్షాలు పడినా వేరుశనగ, ఇతర ప్రధాన పంటలు విత్తుకున్నా దిగుబడి కష్టమే. దీనిని దృష్టిలో ఉంచుకుని, రైతులు వచ్చే నెలలో ప్రత్యామ్నాయ పంటలైన కొర్ర, ఉలవ, సజ్జలు, అలసంద తదితర పంటలు సాగు చేసుకుంటే బాగుంటుంది.

వేడుకున్నా.. వినకపోతివే నాన్నా..!

బెళుగుప్ప, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లిలో కుటుంబ కలహాలతో ఆదివారం ఓ తండ్రి... విషపు గుళికలు మింగి, తన ఇద్దరు బిడ్డలకు కూడా మింగించాడు. బిడ్డలు సహా చనిపోవాలనుకున్నాడు. ముగ్గురూ విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కలపల్లికి చెందిన రమేష్ రెడ్డి, దివ్యశ్రీ దంపతులు పదెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఆరేళ్ల కుమద్విని, నాలుగేళ్ల చైత్ర సంతానం. దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన రమేష్ రెడ్డి ఆదివారం ఉదయం తోటలోకి తన ఇద్దరు కుమార్తెలను తీసుకెళ్లాడు. తొలుత తాను విషపుగుళికలు మింగాడు. తర్వాత ఇద్దరు బిడ్డలతో బలవంతంగా మింగించాడు. బిడ్డలను తీసుకుని ఇంటికొచ్చాడు. విషపు గుళికలు మింగాననీ, తలంతా తిరుగుతోందని తల్లి వెంకటలక్ష్మికి రమేష్ రెడ్డి చెప్పాడు. కుమద్విని కూడా నాన్న తమో ఏవో గుళికలు మింగించాడనీ, వాసన వస్తోందంటూ తల్లి దివ్యశ్రీకి చెప్పి వాంతులు చేసుకుని, సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే తండ్రి, కుమార్తెలను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఫిర్యాదు అందలేదని బెళుగుప్ప పోలీసులు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఆదివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని జాకీర్ కొట్టాల సమీపంలో గల చమన్‌సాబ్ ఫంక్షన్‌హాల్లో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో ప్రభుత్వం దూదేకుల సంక్షేమం కోసం బీసీ సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి స్వయం ఆర్థిక ప్రతిపత్తికి నిర్ణయం తీసుకుందన్నారు. దీనిని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఇందుకు కృషి చేసి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాసీం, ప్రధాన కార్యదర్శి మహబూబ్‌సాహెబ్, కోశాధికారి ఖాసీం, నాయకులు అల్లీపీర, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గంలో ఉచిత వైద్యశిబిరం

నార్పల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గం గ్రామంలో ఆదివారం అనంతపురం నగరానికి చెందిన ఆదిత్య ఆస్పత్రి వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రాజశేఖర్, స్వరూప్, ప్రవీణ్‌కుమార్, శ్వేత, శాంతి తదితరులు పాల్గొని సుమారు 200 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ సాకే రామాంజనేయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఏఎస్ఐ నాగరాజుకు ఉద్యోగోన్నతి

నార్పల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ నాగరాజు ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది తిరుపతికి బదిలీ అయ్యారు. ఇందుకు ఆయనను స్థానిక స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ సాగర్, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

నేడు సోదనపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

శింగనమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోదనపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సాయంత్రం 4గంటలకు నిర్వహించే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

అనంతపురం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఈడిగ సంఘం నాయకులు నగరానికి చెందిన లావణ్య అనే విద్యార్థినికి చదువు నిమిత్తం రూ.60వేలు ఆర్థిక సాయం చేశారు. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న ఆ విద్యార్థిని తండ్రి ఇటీవల మరణించారు. తల్లి కూలి పనులకు వెళ్తోంది. చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న ఈడిగ సంఘం నాయకులు రాయల్‌నగర్‌లో గల రేణుక ఎల్లమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఈడిగ కులస్థుల సహకారంతో విద్యార్థినికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈడిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి మనోహర్, గౌరవాధ్యక్షులు శంకర్‌గౌడ్, నారాయణస్వామి, రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, టీడీపీ రాష్ట్ర ఈడిగ సాధికార సమితి సభ్యులు వేణుగోపాల్ గౌడ్, వెంకటేష్, లాల్‌బాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: వైసీపీ

శింగనమల, జూలై27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పెరవలి, పోతురాజుకాల్వ, చక్రాయపేట, సి.బండమీదపల్లి, శివపురం గ్రామాల్లో ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి బాబుషూరిటీ-మోసం గ్యారెంటీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుడా మోసాలకు పాల్పడుతోందని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పూలప్రసాద్, నాయకులు నూర్‌మహ్మద్, ఆలీబాషా, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.2.81 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.2,81,100 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,61,500, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,19,600 మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. గత వారం కంటే ఈవారం ఆదాయం తగ్గిందన్నారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో సంత ఆదాయం తగ్గినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

పాడి రైతులకు సబ్సిడీతో గడ్డి విత్తనాలు

శింగనమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పాడి రైతులకు 75 శాతం సబ్సిడీ తో గడ్డి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు శింగనమల పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మనాభయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. 75 శాతం సబ్సిడీతో కిలోగడ్డి విత్తనాలు ఇస్తామన్నారు. ఒక్కో రైతు 30 కేజీలు తీసుకెళ్లచ్చవన్నారు.

పెనకచెర్ల డ్యాంలోని మదర్సా సందర్శన



మతపెద్దలతో చర్చిస్తున్న ఉమర్ ముక్తియార్

గార్లదిన్నె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల డ్యాం గ్రామంలో ఉన్న జియా అల్ హసన్ పురాతన మదర్సాను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ ఉమర్ ముక్తియార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ మదర్సాలో ఎంతమంది పిల్లలున్నారు... సమస్యలు ఏవైనా ఉన్నాయా అని మత పెద్దలతో చర్చించారు. ఇక్కడ 70 మంది పిల్లలున్నారని, నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేవని, అలాగే గదుల కొరత ఉందని, వీటితో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని మతపెద్దలు చెప్పారు. స్పందించిన ఉమర్ మదర్సాకు అవసరమైన మౌలిక సదుపాయాలను చమన్‌సాబ్ ఫౌండేషన్ ద్వారా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారితో కలిసి విందు చేశారు. అనంతపురం పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకులు ఎస్ఎం బాషా, చాంద్‌బాషా, రఫీ, మఫీసాబ్, సల్మాన్, చమన్‌ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

అనంతపురం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో వడ్డెర్లకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. వడ్డెర్ల కుల గురువు, స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలనే దిశగా ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాలకృష్ణ, సిమెంట్ పోలన్న, దేవళ్ల మురళి, మల్లెల జయరాం, దలవాయి వెంకటనారాయణ, కుంచపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్జీఓ హోంలో సమావేశమైన వడ్డెర్లు

ఇసుక అక్రమ తరలింపు ఆగేదెన్నడు?

- ఇష్టారాజ్యంగా తవ్వకాలు, తరలింపు
- విషయం తెలిసినా అధికారులు పట్టించుకోలేదంటున్న ప్రజలు





ఉల్లికల్లు వద్ద పెన్నానదిలో ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, అదే గ్రామంలో ఇసుకను డంప్ చేసిన దృశ్యం

శింగనమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకల నుంచి, పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక పెద్దఎత్తున అక్రమంగా తరలుతోందని, కొందరు అక్రమార్కులు ఇష్టా రాజ్యంగా తవ్వకాలు జరిపి ఇసుకను పగలు, రాత్రీ తేడా లేకుండా తరలిస్తున్నారని, ఇంతజరుగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలో పెన్నానది పరివాహక ప్రాంతాలైన నిదనవాడ, రాచేపల్లి, ఉల్లికల్లు, కల్లుమడి, సలకం చెరువు, జూలాకాలువ తదితర గ్రామాల్లో ఇసుకను తవ్వి అక్కడే రహస్య స్థావరాల్లో డంప్ చేస్తున్నారని, తర్వాత రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని చెబుతున్నారు. రెవెన్యూ, పోలీసుల అధికారులకు విషయం తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఎప్పుడైనా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తూతూమంత్రంగా వాహనాలను సీజ్ చేసి తరువాత వదిలేస్తున్నారని వాపోతున్నారు. ఇసుక అక్రమ తరలింపు విషయంలో అధికారులకు మామూళ్లు అందుతున్నట్లు, అందుకే వారు పట్టించుకోవడం లేదన్నట్లు సమాచారం ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును ఆపాలని వారు కోరతున్నారు.



కల్యాణోత్సవం చేస్తున్న వేదపండితులు



పాల్గొన్న భక్తులు



కన్నులపండువగా రుక్మిణీ కల్యాణం

అనంతపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డులో గల భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రుక్మిణీ కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన మాధవాచార్యుల శిష్యబందం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేసి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే గోపూజలు, విశ్వక్సేన ఆరాధన గావించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పెళ్లి కాని యువతీ యువకులకు త్వరితగతిన మంచి వివాహాలు కుదరాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లుసాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ తెలిపారు. చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి, మనూరు నాగరాజరావు, కణంపల్లి ఉమారాణి, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, సాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను పెంచుకోవాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి
- ఎస్ఆర్ఐటీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు ప్రొఫెషనల్ సర్టిఫికెట్లు అందజేస్తున్న హేమచంద్రారెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు

బుక్కరాయసముద్రం, జూలై 27(ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంచుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీచైర్మన్, జేఎన్‌టీయూ ఆచార్యులు హేమచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం 3వ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా హేమచంద్రారెడ్డితో పాటు జేఎన్‌టీయూ ఆచార్యులు వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల చైర్మన్ ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉత్తమ సమాజ ఆవిర్భావం కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. 'మీ.. మీ రంగాలలో ప్రతిఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకుని దేశాభివృద్ధికి పాటు పడాలన్నా'రు. దేశం మార్పు వైపు అడుగులు వేస్తున్న సమయంలో మీరు పట్టభద్రులయ్యారని, మీ సాంకేతిక నైపుణ్యం ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. అనంతరం ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతోనే ఎస్ఆర్ఐటీ కళాశాలను 2008లో స్థాపించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 7500 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని, అందులో 6వేల మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారని తెలిపారు. వెయ్యి మంది ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లినట్లు చెప్పారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు 450 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. తర్వాత 620 మంది విద్యార్థులకు ప్రొఫెషనల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్‌చైర్మన్ రంజిత్‌రెడ్డి, సీఈఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వీకే కుటుంబ ఆశయాలను కొనసాగిస్తాం


- పార్వతమ్మ సంస్మరణ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న రామక్రిష్ణ

అనంతపురం విద్య, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమంలో వీకే కుటుంబం పాత్ర ఎనలేనిదని, ఆ కుటుంబ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని సీపీఐరాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని వీకే భవన్‌లో ఆదివారం వీకే పార్వతమ్మ సంస్మరణసభను నిర్వహించారు. రామక్రిష్ణతోపాటు సీపీఐ నాయకులు, ఉద్యమకారులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో రామక్రిష్ణ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖరరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, వీకే ఆదినారాయణరెడ్డి, వీకే పార్వతమ్మ గుర్తుండి పోయే నాయకులన్నారు. ఉద్యమ నాయకులు, కార్యకర్తలకు ఇంటిలోనే ఆశ్రయం కల్పించి శిక్షణ ఇచ్చిన మహానాయకురాలని వీకే పార్వత్వమ్మ అని కొనియాడారు. అలాంటి నాయకురాలు మరణం పార్టీకి,ఉద్యమాలకు తీరని లోటన్నారు. సీపీఐ నాయకులు జాఫర్, జగదీష్, నారాయణస్వామి, శ్రీరాములు,రాజారెడ్డి, కృష్ణుడు, కుళ్లాయిస్వామి, వైసీపీమాజీ ఎంఎల్‌ఏ విశ్వేశ్వరరెడ్డి, సీపీఎం జిల్లాకార్యదర్శి నల్లప్ప,సీపీఐఎంఎల్ ఇండ్లప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



వెంకట రామయ్యకు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వై. వెంకట రామయ్య నియమితులయ్యారు. స్థానిక అశోక్‌నగర్‌లోని నేతాజీ పార్క్‌లో ఆదివారం ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. మొదట ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లబోతుల కొండయ్య మాట్లాడుతూ ఏకలవ్య ట్రైబల్స్ కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న వై వెంకటరామయ్యను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ట్రైబల్స్ ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

అనంతపురం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మండల పరిధిలోని రాచానపల్లి సమీపంలో గల ఎరా ఇంటర్నేషన్ స్కూల్ వి ద్యార్థులు ఎంపికయ్యా రు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆ స్కూల్లో ఆదివారం అభినందించారు. చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం సిద్ధారాంపురంలో షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడకారుల ఎంపిక జరిగిందన్నారు. ఇందులో పాఠశాలకు చెందిన మౌనిక, నైనిక, సిద్దార్థ్, మోహిత్, నవీన్‌లు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు.

ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో ఉదయ్ ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఉదయ్‌కుమార్ నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో నగరానికి చెందిన చెస్ కోచ్ ఉదయ్‌కుమార్ నాయుడు ప్రతిభ కనబరిచారు. గత ఐదు రోజులుగా తమిళనాడులోని తంజావూరులో గోల్డెన్ స్క్వేర్ చెస్ అకాడమీ నిర్వహి స్తున్న విమన సిటీస్ వన్ ఇంటర్నేషనల్ ఫిడే రేటెడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఐదు దేశాల నుంచి మొ త్తం 500మంది వరకు క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించారు. ఇందులో అనంతపురం నగరానికి చెందిన ఒకటో రోడ్డులోని ఏ1 చెస్ అకాడమీ చీఫ్‌కోచ్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు ఓపెన్‌లో రెండో స్థానంలో నిలిచి మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు రూ.40వేలు నగదు బహుమతిని అందుకున్నారు. పలువురు కోచ్‌లు, క్రీడాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పాతూరు ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎంపిక

అనంతపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరు ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 94మందితో కూడిన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా చల్లా కృష్ణరంగయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాచర్ల అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏవీ రత్నం, ఆలయ కమిటీ ధర్మకర్తగా గర్లాల నాగరాజు, కోశాధికారిగా ధూపకుంట్ల సాయినాథ్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా వంకదారు వెంకటకృష్ణ తదితరులు ఎంపికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తిరువీధుల జగదీష్‌కుమార్, షబరి వరప్రసాద్, పిన్ను నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదాలకు నెలవుగా ఉన్న మురుగు కాలువ



శ్లాబ్‌లు తీసివేయడంతో ఓపెన్‌గా ఉన్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మురుగుకాలవపై ఉన్న శ్లాబ్(సిమెంట్ పలకలు)లను తొలగించిన పారిశుధ్య కార్మికులు తర్వాత మూసివేయడం మరిచారు. దీంతో ఆ కాలువ వద్ద ప్రమాదం పొంచి ఉంది. స్థానిక శారదానగర్‌లో గల మొదటి క్రాస్‌లో మురుగుకాలవపై రాకపోకలు సాగించేందుకు శ్లాబ్‌లు ఏర్పాటు చేశారు. కాగా నెల రోజుల క్రితం కాలువలో మురుగు తీసేందుకు పారిశుధ్య కార్మికులు వాటిని సగం వరకు తీసి పక్కన పడేశారు. పని తర్వాత మూసివేయడం మరిచారు. దీంతో కాలువపై వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకముందే మురుగు కాలవపై శ్లాబ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హాస్టల్ వద్ద సమస్యల పరిష్కారం



హాస్టల్ వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

శింగనమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం వద్ద నెలకొన్న పలు సమస్యలను ఇటీవల ఇక్కడికి వచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి విద్యార్థులు తెలియజేశారు. స్పందించిన ఆమె సొంత నిధులు ఖర్చు చేసిన ఆ సమస్యల్ని పరిష్కరించారు. ఈ క్రమంలో ఆదివారం వసతి గృహం చుట్టూ ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. అలాగే ఆవరణలోని నీటి బోరును శుభ్రం చేయించి ట్యాంకుల్లోకి నీటిని సరఫరా చేయించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనంతపురంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శిల్పారామం ఆధ్వర్యంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. డిస్కవర్ అనంతపురం, గ్రీన్ ఆర్మీ, శక్తి శారీస్ సహకారంతో ధర్మవరానికి చెందిన మానస నృత్య కళాకేంద్రం కళాకారులు సినీ, శాస్త్రీయ, జానపదం నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. చిన్నారుల నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, కళాకారులు శాన్విస్వరూప్, చంద్రిక, సర్వజ్ఞ, వీక్షిత, విశాంత్, బానుశ్రీ, మాధవి, జోష్నాశ్రీ, సుస్మిత,సాయిప్రసాద్, నిక్షిత, పృథ్వీజ్ఞాన, హారిక, శాన్విత, హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ పార్క్‌లో సంగీత విభావరి



నాటి మధుర గీతాలు ఆలపిస్తున్న గాయకులు

అనంతపురం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : అలనాటి నటి, పద్మ విభూషణ్ సరోజ సంస్మరణార్థం పాతపాటల ప్రేమికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హౌసింగ్‌బోర్డు రాజీవ్ పార్కులోని ఘంటసాల మండపం వద్ద నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. ఈ సందర్భంగా తొలుత అలనాటి నటి సరోజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు నాటి మధురగీతాలు ఆలపిస్తూ సంగీతప్రియులను ఓలలాడించారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సంగీత కళాకారిణి కళ్యాణి దేశ్‌పాండే, ఘంటసాల ట్రస్టు చైర్మన్ జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, జీవీ రామయ్య, ఓబుళదాస్, సుధాకర్‌బాబు, రంగస్వామి, కట్టా జీవన్, వెంకటేశ్వర్లు, అనురాధ, శ్రీదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి: యూటీఎఫ్

అనంతపురం విద్య, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం సరికాదని, వెంటనే పీఆర్సీ కమిటీతో పాటు ఐఆర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్రసహాయకార్యదర్శి సురేష్‌కుమార్ డిమాండ్ చేసారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ శ్రేణులతో వర్క్‌షాప్ కొనసాగింది. ఈసందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఫ్రెండ్లీప్రభుత్వం అని అధికారంలోకి వచ్చిన కూటమి ఏడాదైనా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించలేదన్నారు. రావాల్సిన బకాయిలు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. పీఆర్సీ కమీషన్‌ను వెంటనేప్రకటించి పీఆర్సీనీ అమలు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. టీచర్లను బోధనకు మాత్రమే వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లాఅధ్యక్షుడు గోవిందరాజులు, జిల్లా ప్రధానకార్యదర్శి లింగమయ్య, నాయకులు రమణయ్య, రామప్ప, రాఘవేంద్ర, హనుమంతరెడ్డి, ప్రమీల, రవికుమార్, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంపమల్లయ్య స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

శింగనమల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండల్లో వెలసిన గంపమలయ్యస్వామికి ఆదివారం శ్రావణ మాస పూజలు ఘనంగా జరిగాయి. పూజారులు ఆ కొండలలోని ఓ బండపై స్వామి ఉత్సవమూర్తిని ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున కొండపైకి వెళ్లి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా బండకింద గుహలో వెలసిన స్వామివారికి పూజలు చేసేందుకు గత నాలుగేళ్ల కిందట పూజారి పాపన్న దిగుతుండగా.. కాలుజారి కిందనున్న లోయలో పడి మృతి చెందాడు. అప్పటి నుంచి రెవెన్యూపోలీసు అధికారులు గుహలోకి దిగి పూజలు చేయరాదని ఆంక్షలు విధించారు. ఇక అప్పటి నుంచి పూజారులు గుహలోకి దిగి పూజలు చేయడం నిలిపివేశారు. కేవలం బండపైనే ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సారి కూడా గుహలోకి వెళ్లి పూజ చేసే పద్ధతి లేనట్టేనని భక్తులు నిట్టూర్చారు.

సంప్రదాయాన్ని కొనసాగించాలి

అనంతపురం వైద్యం, జూలై 27(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఉద్యోగులను గౌరవించుకునే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రపేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆదివారం ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో గౌరవ సత్కార సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ రామచంద్ర సభను ప్రారంభించి మాట్లాడారు. ఏ ప్రభుత్వ శాఖలోని ఉద్యోగులను అయినా ఉద్యోగవిరమణ పొందిన తరువాత ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో గౌరవ సన్మానం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. అనంతరం ఉద్యోగులు వలిగొండ రామకృష్ణ, కోటి మల్లేష్, యల్లయ్యను ఘనంగా సన్మానించారు. వివిధ సంఘాల నాయకులు డాక్టర్ అక్కులప్ప, డాక్టర్ ఎండీ నాగభూషణం, ముత్యాలరాజు, ఆదినారాయణ, శ్రీనివాసులు, జీవీ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇళ్లపై తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు


శ్రీధరఘట్టలో ఓ ఇంటిపై తక్కువ ఎత్తులో ఉన్న తీగలు

బొమ్మనహాళ్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో దాదాపు 25 ఇళ్లపై విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ తీలను పైకి లాగాలని, లేదా ఇళ్లపై నుంచి కాకుండా పక్కన నుంచి ఏర్పాటు చేయాలని పలుమార్లు లైన్‌మెన్లకు, అధికారులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. అంతేకాకుండా తీగలు చాలా లూజ్‌గా వేలాడుతుండటంతో.. గాలి వచ్చినప్పుడు అవి స్పార్క్ అయి.. నిప్పులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాఖలందర్ అనే వ్యక్తి ఇంటి పైకప్పు దెబ్బతింది. ఆ ఇంటిపై తక్కువ ఎక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటంతో.. ఇంటి కప్పు మరమ్మతులు చేయడానికి బేల్దారులు రావడంలేదని బాధితుడు వాపోయాడు. దీనిపై విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డిని వివరణ కోరగా.. స్థానికులు ఎవరూ ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకోరాలేదని, పరిశీలించి విద్యుత్ తీగలు సరి చేస్తామని చెప్పారు.

నేడు ఆరాధన

బెళుగుప్ప, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మంజునాథస్వామి 51వ ఆరాధన మహోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, గంగపూజ, గౌరీసమేత మంజునాథస్వామికి బిల్వార్చన, పంచామృతాభిషేకం, మధ్యాహ్నం వరుణ దేవ పూజలు, సాయంత్రం రథోత్సవం, రాత్రి భజనలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఆదివారం ఇన్‌ఫ్లో 1,405 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఐదు, ఆరు రోజుల్లో రిజర్వాయరును పూర్తి స్థాయిలో నింపాలన్న లక్ష్యంతో 6 నుంచి 8 పంపులతో ఎత్తిపోతలను చేపడుతున్నామన్నారు. దీంతో కృష్ణ జలాలు చేరిక పెరిగింది. రిజర్వాయరు సామర్థ్యం 1.68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.282 టీఎంసీల నీరు ఉంది.

జీతాలు మంజూరు చేయాలి

కుందుర్పి, జూలై 27(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలను తక్షణమే మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మయ్య ఆదివారం ప్రకటనలో కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు జూన్ జీతం అందించకపోగా జూలై మాసపు జీతం కూడా క్లైయిమ్ చేసే పరిస్థితుల్లో ప్రభుత్వం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించరాదన్నారు. 12వ పీఆర్సీ నియమించి మధ్యంతర భృతిని మంజూరు చేయాలన్నారు.

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు



కూడేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లిపల్లిలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకొని.. ప్రమాదంగా మారింది. ఆ ట్యాంకు పిల్లర్లు దెబ్బతిని ఇనుప కడ్డీలు బయటపడ్డాయి. దీనికి తోడు ట్యాంక్‌కు లీకేజీలు ఉండటంతో నిత్యం నీరు వృథా అవుతోంది. ఇళ్ల మధ్యనున్న ఈ నీటి ట్యాంకు ప్రమాదకరంగా మారడంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీటీ కాలనీలో ఆదివారం ఇద్దరు మట్కాబీటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40,200, చిట్టీలను స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. వారిపై కేసు నమోదుచేశామన్నారు.

మద్యం స్వాధీనం

పుట్లూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనగలగూడూరులో ఓ వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచుకున్న 90 కర్ణాటక మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతన్ని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేశామని చెప్పారు.

మారిన పాఠశాల రూపురేఖలు


నిర్మాణం పూర్తయిన తరగతి గదులు

ఉరవకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆర్ఎంఎస్ఏ కింద ఆరు గదుల నిర్మాణాన్ని రూ.60లక్షలతో చేపట్టింది. 2019 ఎన్నికల సమయానికి సగానికి పైగా పనులు పూర్తి అయ్యాయి. తర్వాత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆ నిర్మాణ పనులను నిలిపివేసింది. దీంతో గదుల కొరత కారణంగా అసంపూర్తి భవనాల్లోనే పిల్లలు విద్యను అభ్యసించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానికులు ఈ విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి రూ.30 లక్షలు మంజూరు చేయించారు. భవన నిర్మాణాన్ని ఆరు నెలల్లోనే పూర్తి చేయించారు. నేడు విద్యార్థులకు కొత్త గదుల్లో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

బీజేపీ నాయకుడికి నివాళి


రవి (ఫైల్)

కణేకల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ నాయకుడు వేలూరు రవి(62) ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సందింటి శ్రీనివాసులురెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, తిప్పేస్వామి, క్రాంతికుమార్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

సాగుకు సిద్ధం



యల్లనూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో తరిభూములను వరిసాగుకు సిద్ధం చేస్తున్నారు. బోర్లు, చెరువుల ద్వారా నీటి సౌకర్యం ఉన్న చోట రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే పొలాల్లో వరినాట్లు వేయడానికి నారును సిద్ధంగా ఉంచారు. కొందరు రైతులు వరిసాగు పొలాల్లో భూమిని సారవంతం చేయడానికి జీలు, పిల్లిపెసర, జనుము తదితర పచ్చిరొట్టె పైర్లను పెంచి ట్రాక్టర్, యంత్రాలతో భూమిలోపలే కుళ్లేలా చేసి.. ఆ తర్వాత వరినాట్లు వేస్తున్నారు. యల్లనూరు, పెద్దమల్లేపల్లి, కల్లూరు, నిట్టూరు, చిలమకూరు, గొడ్డుమర్రి గ్రామాల్లో వరిసాగుకు సుమారు 500 హెక్టార్లను సిద్ధం చేస్తున్నారు.

రోడ్లు ఇలా.. వెళ్లేది ఎలా..?

వర్షానికి అధ్వానంగా మారుతున్న రహదారులు


యాడికి మార్కెట్‌కు వెళ్లే రహదారి


రాయలచెరువు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి


గుంతలు పడ్డ కూడేరు- ఆత్మకూరు రోడ్డు

యాడికి/ కూడేరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): యాడికిలో మార్కెట్‌కు వెళ్లే దారి, రాయలచెరువులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి అధ్వానంగా మారాయి. చిన్న పాటి వాన వచ్చినా.. ఆ దారులు మొత్తం బురదమయం అవుతున్నాయి. ఈ దారిలో వెళ్లే అనేక మంది పాదచారులు, ద్విచక్రవాహనదారులు జారిపడి గాయపడ్డారు.

కూడేరు నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పాడటంతో కొన్ని సంవత్సరాలుగా ప్రయాణం నరకంగా మారింది. ఈ గుంతల రోడ్ల వల్ల తమ బైక్‌లు మరమ్మతులకు గురవుతున్నాయని కరుట్లపల్లి, పి. నారాయణపురం, తిమ్మాపురం, యాలేరు, తదితర గ్రామాల వాసులు వాపోతున్నారు. ఆటో వల్ల వచ్చే ఆదాయం దాని రిపేరీలకు సరిపోతోందని కరుట్లపల్లికి చెందిన ఆటో డ్రైవర్ గంగాదేవి వాపోయింది. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను ఏ మాత్రం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా స్పందించి.. బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సామాజిక న్యాయమే టీడీపీ లక్ష్యం

ఎమ్మెల్యే గుమ్మనూరు, ఎంపీ అంబికా వెల్లడి


ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీదేవి, రామప్ప, చిత్రంలో ఎమ్మెల్యే, ఎంపీ

గుంతకల్లు, జూలై27(ఆంధ్రజ్యోతి): పదవుల కేటాయింపులో సామాజిక న్యాయమే లక్ష్యంగా టీడీపీ ముందుకెళ్లోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గుంతకల్లు మార్కెట్ యార్డు పాలక కమిటీ వ్యవస్థాపక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాతగుంతకల్లులోని కనకదాసు విగ్రహానికి, మస్తాన్ వలీ దర్గాలో పూజలు చేసిన అనంతరం మార్కెట్ యార్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డు కార్యదర్శి బాలాజీ రావు నేతృత్వంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. చైర్‌పర్సన్‌గా ఎస్ లక్ష్మిదేవి, వైస్ చైర్మన్‌గా కే రామప్ప, సభ్యులుగా వీరాంజనేయులు, అరుణ, రామకృష్ణ, నాగసముద్రం శ్రీదేవి, వన్నూరప్ప, పీ శివానంద, గౌరి, ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, షేక్ మాలిన్, సావిత్రి, రమాదేవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి పాటుపడిన వారిని గుర్తించి సామాజిక వర్గాల వారీగా అందరికీ తగిన ప్రాధాన్యతనివ్వడం జరుగుతోందన్నారు. ఎంపీ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో వెన్నంటి నిలిచినవారిని చంద్రబాబు గుర్తించి తగిన ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, వాసగిరి మణికంఠ, హరిహరనాథ్, కొలిమి రామాంజనేయులు, మత్రునాయక్, పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు పనులు


రోడ్డు వేస్తున్న సిబ్బంది

ఉరవకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ-పాల్తూరు బీటీ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో రహదారి అధ్వానంగా తయారు కావడంతో .. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 10న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.2.50 కోట్ల నాబార్డు నిధులతో 10 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు పూర్తి చేశారు. మరో 20 రోజుల్లోపు పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులను ఆర్అండ్‌బీ జేఈ నాగభూషణం పరిశీలించారు.

అధికారుల్లో కొరవడిన చిత్తశుద్ధి..!

నిరుపయోగంగా చెత్తతో సంపద తయారీ కేంద్రాలు


యాటకల్లులో నిరుపయోగంగా చెత్తతో సంపద తయారీ కేంద్రం

శెట్టూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద తయారీ చేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ ప్రభుత్వం మండలంలో 16 చెత్తతో సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను ఏ మాత్రం పట్టించుకోలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ కేంద్రాలను తిరిగి వినియోగంలో తేవాలని ప్రయత్నిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో ఆ కేంద్రాలు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి.

పంచాయతీ కార్యదర్శుల కొరత

- 13 పంచాయతీలకు ముగ్గురే..
- అపరిశుభ్రంగా మారిన రోడ్లు, వీధులు


కుందుర్పి ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న మురుగు

కుందుర్పి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలో 13 పంచాయతీలకు కేవలం ముగ్గురు మాత్రమే పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఈ ముగ్గురితోనే మండలంలోని అన్ని పంచాయతీల్లో పరిపాలన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంటే ఒక్కో పంచాయతీ కార్యదర్శి నాలుగేసి పంచాయతీల్లో పాలన సాగిస్తున్నారు. ఇన్ని పంచాయతీలను చూసుకోలేక వారు సతమతం అవుతున్నారు. అటు సచివాలయ విధులనూ సక్రమంగా చేపట్టలేకపోతున్నారు. దీంతో గ్రామాల అభివృద్ధి అటుంచి.. రోడ్లు, వీధులు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయి. మురుగు కాలువలు చెత్తతో నిండిపోవడంతో రోడ్లు, వీధుల్లోనే మురుగు పారుతోంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద కూడా మురుగు ప్రవహిస్తుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలతో సావాసం

దశాబ్దాలుగా తీరని 'జల్లిపల్లి' కష్టాలు


శిథిలావస్థలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం భవనం


రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు


పాఠశాలలో ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

కూడేరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం - బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న జల్లిపల్లి గ్రామంలో దశాబ్దాలుగా పలు సమస్యలు తిష్ట వేశాయి. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా.. ఈ గ్రామస్థుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఈ. గ్రామంలో డ్రైనేజీలు దెబ్బతినడంతో ఇళ్ల మధ్య, వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. దీని నుంచి దుర్వాసన రావడంతో పాటు దోమలూ అధికం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు గ్రామంలో తాగునీటి ట్యాంకు దెబ్బతిని నీరు లీకై రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. ఈ గ్రామంలో వీధిలైట్లు వెలగకపోవడంతో విషపురుగులు అధికంగా సంచరిస్తున్నాయి. ఇక ఈ గ్రామంలోని ఆరోగ్య వైద్య ఉపకేంద్రంలో కనీస సౌకర్యాలు లేవు. భవనమూ శిథిలావస్థకు చేరుకుంది. ఈ గ్రామ సమీపంలో నూతనంగా వెలసిన కాలనీలకు సరైన విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

దాదాపు వంద మంది బాలికలున్న జల్లిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరైన బాత్‌రూములు, మరుగుదొడ్ల లేకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. గది లేకపోవడంతో మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే తయారు చేస్తున్నారు. నాడు-నేడు కింద చేపట్టిన మరుగుదొడ్లు, బాత్ రూములు, వంగ గదుల నిర్మాణాలు నిధులు లేక ఆగిపోయాయి. శ్మశానంలో నీటి, నీడ సౌకర్యం లేదు. శ్మశానికి ప్రహరీ కూడా లేదు.

నూతన భవనం నిర్మించాలి



ఆస్పత్రి భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. కనీస సౌకర్యాలూ లేవు. రోగాలు వస్తే కూడేరు, అనంతపురానికి వెళ్తున్నాం. చుట్టుపక్కల చెత్తతో దుర్వాసన వస్తోంది. పట్టించుకునేవారే లేరు. కొత్త భవనాన్ని నిర్మిస్తే మేలు.

-ఈడిగ చంద్రకుమార్, జల్లిపల్లి

డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలి



ఏ వీధిలో చూసినా డ్రైనేజీలు చెత్తతో నిండిపోయాయి. మురుగు రోడ్లపైనే పరుగులు తీస్తోంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలు అధికం కావడంతో రాత్రి సమయంలో నిద్రలేక ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. అధికారులు డ్రైనేజీలను శుభ్రం చేయించాలి.

- నాగభూషణం, జల్లిపల్లి

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి



గ్రామంలో విద్యుత్ లైట్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో వీధి కుక్కలు, విషపురుగుల భయంతో ఇబ్బందులు పడుతున్నాం. పంచాయితీ అధికారులు వీధిలైట్లు విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు స్పందించి వీధిలైట్లు మరమ్మతులు చేయించాలి.

- రాజగోపాల్, జల్లిపల్లి


ప్రతిష్ఠించిన విగ్రహాల వద్ద భక్తులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

కణేకల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు కట్ట వద్ద ఉన్న పురాతన నాగులకట్ట ఆవరణంలో శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్య సమేత విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాగులకట్ట వద్ద ఉన్న కొన్ని పురాతన విగ్రహాల స్థానంలో తొమ్మిది విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే ఆలయ ఆవరణంలో దాతల సహకారంతో పలు మరమ్మతులు, నూతన షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా.. ఉదయం కూష్మండ బలిదానం, గోవు దర్శనం, త్రయాది హోమం పూర్ణాహుతితో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు, శివ, రాము, ఆలూరప్ప, నాగభూషణం, ఎల్ఐసీ గోపాల్, అనిల్, వెంకటేశులు, త్రిలోక్, టీడీపీ నాయకులు ఆనంద్‌రాజ్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్ పాల్గొన్నారు.



● యాడికి : మండలంలోని రామరాజుపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రేణుకాయల్లమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



● రాయదుర్గంరూరల్ : మండలంలోని డీ కొండాపురంలో నూతన దేవాలయంలో పల్లకి రంగనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మూడురోజులుగా వేదపండితులు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సినిమా షూటింగ్


షూటింగ్‌లో పాల్గొన్న కళాకారులు

గుత్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెరచాప సినిమా షూటింగ్ నిర్వహించారు. అనన్య క్రియేషన్ పతాకంపై దర్శకుడు జోహెల్ జార్జ్ నేతృత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిన్న పిల్లలు విషపూరిత ఆహారం తిని ఆసుపత్రి పాలైన సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రానికి గుత్తికి చెందిన దుర్గం కైలాష్ నిర్మాత. చిత్రం హీరో నవీన్ రాజ్, హీరోయిన్ పూజ, విలన్‌గా రాజేష్ నాయక్ నటిస్తున్నారు. సినిమా షూటింగ్‌ను చూడటానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

రాయదుర్గంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని ఏపీ పీటీడీ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ చేపట్టిన నిరసన రెండో రోజైన ఆదివారమూ కొనసాగింది. ఆర్టీసీ డిపో వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఇందులో డిపో కార్యదర్శి తిప్పేస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓ అనాథ వృద్ధ యాచకుడు అనారోగ్యంతో వారం క్రితం స్థానిక ఆసుపత్రిలో చేరాడు. కోలుకోలేక అతను ఆదివారం మరణించాడు. వైద్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ నలుగురు సేవా సమితి సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సొంత ఖర్చులతో ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో ఆ సమితి నాయకులు ఏపీ చక్రపాణి, కేశవ, రవీంద్ర, రాము, అంజి, లక్ష్మీకాంత్, రత్నక్క, భాస్కర్, ఆటో వేణు, నవీన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు పల్లెలకు చేరాలి

ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ


మాట్లాడుతున్న ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ

కళ్యాణదుర్గంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలు పల్లెలకు కూడా చేరాలని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు, ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. స్థానిక కేజీబీవీ హైస్కూల్లో ఎంఈఎస్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలోని మాదిగ ఉద్యోగుల సదస్సులో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంఈఎఫ్‌ను శక్తివంతంగా చేయుటకు ప్రతి మాదిగ ఉద్యోగి సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై గంగాధర్, ఎంఈఎఫ్ నాయకులు లక్ష్మణ్, రవి శంకర్, నాగేష్, హాస్టల్ వార్డెన్ నాగరాజు, యర్రిస్వామి, చిరంజీవి పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ ధ్వంసం


పగులగొట్టిన హుండీ

కళ్యాణదుర్గం, జూలై 27(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండల పరిధిలోని తిమ్మాపురం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ ధ్వంసం చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సమాచారం అందడంతో ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. హుండీను ధ్వంసం చేసి ఆలయానికి వేసిన తాళాలను పగులగొట్టారు. అక్కడ వున్న వస్తువులను చెల్లాచెదురుగా పడేశారు. పురాతన నరసింహస్వామి దేవాలయంలో దొంగలు చొరబడి నానా బీభత్సం సృష్టించడంతో ఆ కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.